06ATP27_06ATP27.qxd 07-05-2024 PM 10:24 Page 1



# కర్ణాటక వార్తలు

## కర్ణాటకలో రెండోవిడత 14సీట్లకు ఎన్నికలు :65శాతం పోలింగ్

బెంగళూరు,మే7,ప్రభాతవార్త ప్రతినిధి



శివమొగ్గలో ఓటువేసేందుకు సిద్దమైన ఓటర్లు. దీంతోపాటు మరోనాలుగు ప్రముఖుల ఓటు వేసే ఫోటోలు ఉన్నాయి

కర్ణాటకలోని ఉత్తరకర్ణాటక భాగంలో మంగళవారం జరిగిన లోక్‌సభ రెండోవిడత ఎన్నికల్లో 14సీట్లకు 65శాతం పోలింగ్ జరిగింది. కొన్నిచోట్ల ఇవిఎం యంత్రాల మొరాయింపు, గ్రామస్తుల ఓటింగ్ బహిష్కరణ, కాంగ్రెస్ బిజెపి కార్యకర్తల మధ్య రాళ్లురువ్వుడు లాంటి చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈసారి ఇక్కడ కిత్తూరు కర్ణాటక ప్రాంతంలోని చిక్కోడి, బెళగావి, ధార్వాఢ, హావేరి, ఉత్తర కన్నడ, దావణగెరె,, శివమొగ్గసీట్లతో పాటు కళ్యాణ కర్ణాటకలోని బాగలకోట, విజయపుర సీట్లకు బళ్లారి, రాయచూరు, కొప్పళ్, కల్బుర్గి, బీదర్ సీట్లకు ఎన్నికలు జరిగాయి. హై ఓల్టేజి నియోజకవర్గాలుగా పేరుమోసిన పది నియోజకవర్గాల్లో జోరుగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. శివమొగ్గలో మాజీ సిఎం బంగారప్ప కుటుంబీకులు, మాజీ సిఎం యడూరప్ప కుటుంబీకులు ఓటువేశారు. మరో ఇండిపెండెంటు అభ్యర్థి కెఎస్ . ఈశ్వరప్ప కూడా తన కుటంబసభ్యులతో కలసి శివమొగ్గ నగరంలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. దావణగెరెలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రభామల్లికార్జున్ దంపతులు, బిజెపి అభ్యర్థి గాయిత్రి సిద్దేశ్వర్ దంపతులు ఓటువేశారు. కల్బుర్గిలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తన శ్రీమతితో కలసి ఓటేయగా బీదర్‌లో అటవీశాఖ మంత్రి ఈశ్వరఖండ్రే తన కుమారుడు బీదర్ కాంగ్రెస్ అభ్యర్థి సాగర్ ఖండ్రేతో పాటు తన తండ్రి భీమణ్ణఖండ్రేతో కలసి అక్కడి సర్కారు హైస్కూల్‌లో ఓటు వేశారు. ధార్వాఢలో మంత్రి ప్రహ్లాద్ జోషి తన కుటుంబ సభ్యులతో పోలింగ్ కేంద్రంలో ఓటు వేయగా హావేరి బిజెపి అభ్యర్థి బసవరాజు బొమ్మాయి శిగ్గావిలో తన నివాసం పక్కనే ఉన్న పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

## లోక్‌సభ ఎన్నికల్లో గెలుపునకు శిరసి మారికాంబ దేవాలయంలో పూజలు జరిపిన గీతాశివరాజ్‌కుమార్ దంపతులు



పూజలు జరుపుతున్న గీతా శివరాజ్‌కుమార్ దంపతులు.

శివమొగ్గ,మే7,ప్రభాతవార్త ప్రతినిధి

లోక్‌సభ రెండోవిడత పోలింగ్‌లో మంగళవారం శివమొగ్గలో ఓటు వేసే ముందు కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్ ఇక్కడి శిరసి మారికాంబ దేవాలయంలో తమ గెలుపు కోసం ప్రత్యేక పూజలు చేశారు. తరువాత మీడియాతో మాట్లాడిన కన్నడసినీ హీరో శివరాజ్‌కుమార్ తాము ఏటా శిరసి మారికాంబ దేవాలయంలో పూజలు చేసి దేవీ ఆశీస్సులు తీసుకుంటామని చెప్పారు. శివమొగ్గ లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి గీతా గెలుపొందాలని దేవీని ప్రార్థించినట్లు శివరాజ్‌కుమార్ చెప్పారు. ఈసారి ఓటర్లు కాంగ్రెస్‌ను గెలిపిస్తారన్న నమ్మకం కలిగిందని చెప్పారు. గీతా శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ తాను జిల్లాలోని అన్నిఅసెంబ్లీనియోజకవర్గాల్లో సంచరించి కాంగ్రెస్‌ను గెలిపించాలని మనవి చేసినట్లు తెలిపారు. ఓటర్లు సానుకూలంగా స్పందిస్తారన్న నమ్మకంకలిగింది. ఈసారి శివమొగ్గజిల్లా ఓటర్లుమార్పు కోరుకుంటున్నారు. తన గెలుపు గ్యారంటీ అని గీతా శివరాజ్‌కుమార్ చెప్పారు.

## మంగళూరుజిల్లాలో రోడ్డు ప్రమాదం

### - కారుఅంబులెన్సుఢీ ముగ్గురు మృతి

మంగళూరు,మే7,ప్రభాతవార్త ప్రతినిధి

మంగళూరు జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కారు, అంబులెన్సుల మధ్య ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళూరు కేరళ హైవేలోని మంజేశ్వరంవద్ద మంగళూరువైపునకు వస్తున్న కారు ఎదురునుంచి వచ్చిన అంబులెన్స్ ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురు వ్యక్తులుస్థలంలో మృతిచెందారు. అంబులెన్స్‌లోని రోగికి గాయాలయ్యాయి. పోలీసులు స్థలానికిహాజరై గాయాలపాలైనవారిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారులో ప్రయానిస్తున్న అబ్దుల్, రశీద్, మహమద్ అనే వ్యక్తులు మృత్యువాత పడ్డారు.

## పెన్‌డ్రైవ్ కేసును న్యాయాంగ తనిఖీకు జెడిఎస్ డిమాండ్

మైసూరు,మే7,ప్రభాతవార్త ప్రతినిధి

హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల విడియోల పెన్‌డ్రైవ్ కేసును న్యాయాంగ తనిఖీ చేయించాలని జెడిఎస్ నాయకుడు చాముండేశ్వరీ జెడిఎస్ ఎంఎల్ఎ జిటి.దేవెగౌడ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం ఈమేరకు మైసూరులో జెడిఎస్ కార్యకర్తలతో కలసి సర్కారుకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ప్రజ్వల్ కేసును సాకుగా పెట్టుకుని కాంగ్రెస్ సర్కారు మాజీ ప్రధాని దేవెగౌడ పరువును బజారుకు ఈడ్చే పనిలో పడిందని ఆరోపించారు. జెడిఎస్ పార్టీను నాశనం చేసేందుకు కొందరు నాయకులు కూడబలుక్కుని వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ నాయకులకు జరిగిన అవమానాన్ని వారు ఖండించారు. ఇదే మాదిరిగా బెంగళూరు తుమకూరు హాసన్ జిల్లాల్లో జెడిఎస్ పార్టీ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి మాజీ మంత్రి హెచ్‌డి. రేవణ్ణ అరెస్టును ఖండించారు.

## బెళగావిలో ఈసారి గెలుపు నాదే : మృణాల్ హెబ్బాళ్‌కర్

బెళగావి,మే7,ప్రభాతవార్తప్రతినిధి

బెళగావి లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా తాను గెలుపు గ్యారంటీ అని మృణాల్ హెబ్బాళ్‌కర్ చెప్పారు. ఆయన మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలసి బెళగావిలో ఓటు వేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. బెళగావి స్థానికుడిగా ఓటర్లు తనను గెలిపిస్తారన్న నమ్మకం కలిగిందన్నారు. తన గెలుపు యువ నాయకుల గెలుపు అని చెప్పారు. సైనికుడిగా దేశసేవల్లో ఉన్న తాను ఎంపీగా గెలిస్తే బెళగావి జిల్లా సమస్యల గురించి పార్లమెంటులో చర్చించి పరిహారం పొందుతామని చెప్పారు. తన తల్లి లక్ష్మిహెబ్బాళ్కర్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి సతీష్ జారకిహొళి సాయంతో జిల్లాకు అవసరమైన అభివృద్ధి పనులకు అనుమతు సంపాదించి ప్రగతిబాటలో బెళగావి ఉండేలా కృషి చేస్తామన్నారు.



తన కుటుంబ సభ్యులతో కలసి ఓటేసిన కాంగ్రెస్ అభ్యర్థి మృణాల్ హెబ్బాళ్‌కర్

## ఎన్నికల బిజీ పనులు విశ్రాంతి కోసం ఊటీ వెళ్లిన సిఎం సిద్దరామయ్య

బెంగళూరు,మే7,ప్రభాతవార్త ప్రతినిధి

కర్ణాటకలో గత నెలరోజులుగా కాలికి బలపం కట్టుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొని వందలాది బహిరంగ సభల్లో మాట్లాడిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య విశ్రాంతి కోసం తమిళనాడులోని ఊటీకు వెళ్లారని తెలిసింది. నాలుగురోజుల పాటు ఆయన ఊటీలో విశ్రాంతి తీసుకుంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రెండో విడత ఎన్నికలు నేటితో ముగిసిపోవటంతో సిఎం తన అధికృత కార్యకలాపాలకు కాస్తంత విరామం చెప్పి విశ్రాంతి కోసం దూరం ఊరికి వెళ్లారు.

## దావణగెరె బిజెపి అభ్యర్థి ఓటును తానే వేసిన జిఎం సిద్దేశ్వర్

దావణగెరె,మే7,ప్రభాతవార్త ప్రతినిధి



దావణగెరెలో ఓటు వేసిన తరువాత ఓటు మార్కును చూపుతున్న జిఎం సిద్దేశ్వర్ దంపతులు.

దావణగెరె లోక్‌సభ ఎన్నికల్లో ఇవాళ జరిగిన పోలింగ్‌లో బిజెపి అభ్యర్థి గాయిత్రి సిద్దేశ్వర్ తరపున ఆమె భర్త సిట్టింగ్ ఎంపీ జిఎం.సిద్దేశ్వర్ ఓటు వేశారని వార్తలు గుప్పుమన్నాయి. ఈ ఉదయం సిద్దేశ్వర్ దంపతులు గాయిత్రి సిద్దేశ్వర్, జిఎం సిద్దేశ్వర్ అక్కడి హైస్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు రాగా మొదట జిఎం సిద్దేశ్వర్ ఓటింగ్ మార్కింగ్ చేయించుకుని ఇవిఎం వద్దకు వెళ్లారు ఈయన వెంట గాయిత్రి సిద్దేశ్వర్ కూడా మార్కింగ్ చేయించుకుని ఇవిఎం మెషిన్ వద్దకు వెళ్లగా ఆమెకు ఓటు వేసే విషయంలో తికమక పడ్డారు. దీనిని గమనించిన జిఎం.సిద్దేశ్వర్ తన భార్య ఓటును తామే ఓటువేసి బయటకు వచ్చారు. గాయిత్రి సిద్దేశ్వర్ పేరిట ఇదే పోలింగ్ బూత్‌లో ముగ్గురు మహిళా కేండిడేట్ల పేర్లు ఉండటమే దీనికి కారణమని అంటున్నారు. సిట్టింగ్ ఎంపీ తన భార్య ఓటును కూడా తానే వేసి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్ఎస్.మల్లికార్జున డిమాండ్ చేశారు.

## విజయపురలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం : మంత్రి ఎంబి.పాటిల్

విజయపుర,మే7,ప్రభాతవార్త ప్రతినిధి



విజయపురలో మంగళవారం ఓటు వేసిన తరువాత మంత్రి ఎంబి.పాటిల్

విజయపుర లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజు ఆలగూరు మెజారిటీతో గెలుస్తారని మంత్రి ఎంబి.పాటిల్ చెప్పారు. ఆయన మంగళవారం విజయపురలోని తన కాలేజీలో పోలింగ్ బూత్‌లో ఓటేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. ఈసారి బిజెపి అభ్యర్థి రమేష్ జిగజిణగి ఓటమి తప్పదన్నారు. ఆయన విజయపుర జిల్లాకు ఎలాంటి ప్రాజెక్టులు తీసుకురాలేదని ఆరోపించారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ఈసారి కాంగ్రెస్ పార్టీ కనీసం 9సీట్లు గెలుచుకోనుందని చెప్పారు.

## సురపుర అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోలింగ్ చురుకు

సురపుర,(రాయచూరుజిల్లా) మే7,ప్రభాతవార్త ప్రతినిది



సురపుర అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటు వేసిన దృశ్యం

రాయచూరు జిల్లా సురపుర అసెంబ్లీ ఉప ఎన్నికలకు నేడు జరిగిన పోలింగ్‌లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. సురపుర అసెంబ్లీ సీటుకు ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి రాజా వెంకటప్ప నాయక అకాల మృత్యువాత పడటంతో జరిగింది. ఆయన కుమారుడు రాజా వేణుగోపాల నాయక కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా బిజెపి నుంచి మాజీ ఎంఎల్ఎ నరసింహనాయక్ పోటీ చేశారు. కాగా ఇదే అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బ్యాలదహళ్లిలో ఇవాళ పోలింగ్ సమయంలో బిజెపి కాంగ్రెస్ కార్యకర్తలు బాహాటంగా గొడవలకు దిగారు. రాళ్లురువ్వుడు ఘటనలు జరిగాయి, పోలీసుల స్వల్పంగా లాఠీ ఛార్జీ చేసి ఇరు పక్షాల కార్యకర్తలను చెదరగొట్టారు.

## ప్రజ్వల్ రేవణ్ణ సెక్సు విడియోల కేసును సిబిఐకు అప్పగించాలి

### -హెచ్‌డి.కుమారస్వామి డిమాండ్

బెంగళూరు,మే7,ప్రభాతవార్త ప్రతినిధి



విలేకరులతో మాట్లాడుతున్నమాజీసిఎం కుమారస్వామి

ప్రజ్వల్‌రేవణ్ణ అశ్లీల విడియోల కేసును సిబిఐకు అప్పగించాలని జెడిఎస్ అధ్యక్షుడు హెచ్‌డి.కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం బెంగళూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి విడియోలు బయటకు రావటానికి కారకుడైన ప్రజ్వల్ కారు మాజీ డ్రైవర్ కార్తిక్‌ను సిట్‌పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈకేసులో తన సోదరుడు హెచ్‌డి. రేవణ్ణను అనవసరంగా సిట్ అధికారులు ఇరికించారని ఆరోపించారు. బిజెపి నాయకుడు దేవరాజేగౌడ ఆరోపించినట్లు ఈమొత్తం పెన్‌డ్రైవ్‌లరాకకు కారకుడైన ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్‌ను వెంటనే కెబినెట్ నుంచి డిస్మిస్ చేయాలని కుమారస్వామి డిమాండ్ చేశారు. ఎస్ఐటి అంటే శివకుమార్ ఇన్వెస్టిగేషన్ టీం లేదా సిద్దరామయ్య ఇన్వెస్టిగేషన్ టీం అని ఆరోపించారు. ఈ విచారణల వలన తమకు నమ్మకం లేదని వెంటనే సర్కారు దీనిని సిబిఐకు అప్పగించాలని కోరారు. కర్ణాటకలో గతంలో లింగాయతుల డామినేషన్‌ను తొక్కివేయటానికి కాంగ్రెస్ పార్టీ ఆనాడు మాజీ సిఎం వీరేంద్రపాటిల్‌ను వేధించింది. ఇప్పుడు ఒక్కలిగ సమాజాన్ని వేదించేందుకు కుమారస్వామి మరియు దేవెగౌడ కుటుంబాన్ని టార్గెట్ చేసిందని ఆరోపించారు. సిట్ దర్యాప్తు కేవలం ఒక వైపు మాత్రమే జరుగుతోంది. దీనికి మొత్తం డైరెక్షన్ శివకుమార్ చేస్తున్నారని ఆరోపించారు.

## 2.21 లక్షల మందికి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు

### -ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వియోగించుకున్న ఓటర్లు 1,836 -జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్



జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్

ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త

నియోజకవర్గంలో 2,21,601 మంది ఓటర్లకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను పంపిణీ చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులతోపాటు 79,450 ఓటరు గైడెన్స్ ఇన్ఫర్మేషన్ బుక్లెట్లను పంపిణీ చేశామన్నారు. ఈనెల 3వ తేదీ నుండి ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోలింగ్‌లో భాగంగా ఇప్పటివరకు 1,836 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మంగళవారం పోలింగ్ ముగిసే సమయానికి 414 మంది ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేశారన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని జేసీ తెలిపారు.

## తెగిపడిన విద్యుత్ తీగ తాకి పొట్టేలు, మూడు గొర్రెల మృతి

ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త



తెగిపడిన విద్యుత్ తీగ తాకి మృతి చెందిన పొట్టేలు



తెగిపడిన విద్యుత్ తీగ తాకి మృతి చెందిన గొర్రె

తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగలు తాకి పొట్టేలుతోపాటు మూడు గొర్రెలు మృతి చెందిన ఘటన వజ్రకరూరు మండలం చాబాల గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురుబ నక్కల కేశన్న గొర్రెల మందను కాపరి మేపుకు రావడానికి తోలుకొని వెళ్లాడు. గొర్రెలు మైదానంలో మేస్తున్న క్రమంలో కాపరి ఏదో పని నిమిత్తం అత్యవసరంగా గ్రామంలోకిరాగా వచ్చి చూసే సరికి తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగలను తాగిక పొట్టేలు, మూడు గొర్రెలు మృతి చెంది పడివుండటాన్ని గమనించి విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. దీంతో వారు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ తీగలు సోమవారం వీచిన గాలులకు తెగిపడిన సమయంలోనే మరమ్మతులు చేసివుంటే గొర్రెలు మరణించేవి కాదని ప్రమాదం నుండి గొర్రెల కాపరి బయటపడటం ఊపిరి పీల్చుకోవాల్సిన అంశమని గ్రామస్థులు చెబుతున్నారు. పొట్టేలు, గొర్రెల మృతితో లక్ష రూపాయలు ఆస్తినష్టం జరిగిందని విద్యుత్‌శాఖ పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కురుబ నక్కల కేశన్న కోరారు.

## రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి

ధర్మవరం రూరల్, మే 7 ప్రభాతవార్త



పోస్టల్ బ్యాలెట్ ఓటు సద్వినియోగం చేసుకోండి

పోస్టల్ బ్యాలెట్ ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని సంజయ్ నగర్‌లో బిఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల లో ఉన్న వారికి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తదుపరి ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసుల పహ్రారా మధ్య సజావుగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఈ నెల 8వ తేదిన క ఊడా ఉదయం ఏడు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌లలో 1,333 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో ధర్మవరం నియోజకవర్గం వారు 1092, వేర్వేరు జిల్లాలో ఉంటూ ఎన్నికల విధుల్లో ఉన్నవారు 185, శ్రీ సత్యసాయి జిల్లాలో వేర్వేరు నియోజకవర్గాం లో ఉన్న వారు 60మంది వెరసి 1,333 మందిపోస్టల్ బ్యాలెట్‌ను ఉపయో గించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, ఎన్నికల అధికారులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో వైవిఆర్‌కు బ్రహ్మారథం పడుతున్న ప్రజలు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

గుంతకల్లు, మే 7 ప్రభాతవార్త

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వై.వెంకటరా మిరెడ్డికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారు. మంళవారం మండలంలోని అయ్యవారిపల్లి, కదిరిపల్లి, ఇమాంపురం, నాగసముద్రం, గుర్రంబాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి కుటుంబంలో జరిగిన మేలు, పొందిన సంక్షేమ పథకాలు, అందని వారు ఎవరెవరు వున్నారు ఏఏ సమస్యలు వున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పరితపించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మరోమారు ప్రజలు ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కూటమి పేరుతో మూడు పార్టీలు ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యాయని ప్రజలు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందన్నారు. అలాగే పక్క జిల్లాలో ఛీ కొడితే కొంత మంది ఇక్కడికి వచ్చి ఓట్లు అడిగి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని అలాంటి వారిని నమ్మరాదని ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా శంకర్‌నారాయణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## చంద్రబాబుతోనే ప్రజలకు భవిష్యత్తు

### - పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి



ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పల్లె కిషోర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్ మే 07 ప్రభాతవార్త

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని టిడిపి యువనాయకుడు పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటేమనకు వజ్రాయుధం అని ఈ అవినీతి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని చిత్తుగాఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో జెండావేపమాను, పెద్దబజార్, సున్నపురాళ్ళవీధి, గోవిందపేట, ఎస్‌బిఐ రోడ్డు, ప్రాంతాల్లో టిడిపి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని అధికారంలోకి వస్తే అనేక పరిశ్రమలు ఉద్యోగాలు, ఉపాధి రంగం, ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. వైసిపి ప్రభుత్వం యువతకు చేసింది ఏమిలేదన్నారు. పెనుకొండ ప్రాంతంలె కియా లాంటి పరిశ్రమ రాకతో జిల్లాలో 30వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు ప్రత్యేకంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం రాకతో మరెన్నో పరిశ్రమలు రాకుండా పోయాయని గుర్తుచేశారు. ఈ ఐదేళ్లలో జగన్‌రెడ్డి ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని ప్రశ్నించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామల్లో త్రాగునీటి సమస్య తీవ్రగా ఉందన్నారు. ఇలాంటి సమయంలో వైసిపి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సోంత వ్యవసాయతోటకు సత్యసాయి నీటిని మరలించి ప్రజలకు నీళ్ల లేకుండా జలదోపిడి చేశారని గుర్తుచేశారు. పుట్టపర్తి అంటే ప్రశాంతతకు మారుపేరుఅని యువనేత కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి అంటే ప్రేమ శాంతికి చిహ్నామని అలాంటి పుట్టపర్తిలో టిడిపి అభ్యర్థి పల్లె సింధూర సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి అమరావతిలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాల్మీకి రామాంజినేయులు, రామ్‌లక్ష్మన్ సోదరులు, కరణం సుబ్రమణ్యశ్వరరావు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు రామాంజినేయులు, జ్యోతిప్రసాథ్, లాయర్ హరికృష్ణ, నారాయణ, మురళి, సూరి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బళ్లారి లోకసభ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

బళ్లారి, మే 07 ప్రభాతవార్త:



ఓట్లు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం...

బళ్లారి లోకసభ నియోజకవర్గానికి మంగళవారం జరిగిన ఎన్నికల్లో సుమారు 70శాతం అధికంగా ఓట్లు వినియోగించుకున్నారని సమాచారం అందింది. బళ్లారి జిల్లా వ్యాప్తంగా 8నియోజకవర్గాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎన్నికల ప్రశాంతంగా ముగిసాయి.

**బారులు తీరిన ఓటర్లు :** బళ్లారి లోకసభ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతంలోని పరిసరాల్లో తమ హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం ఏడుగంటల నుండి ప్రారంభమైన ఎన్నికల్లో సాయంత్రం ఆరు గంటల వరకు సుమారు 70% శాతం అధిక ఓట్లు వినియోగించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బళ్లారి జిల్లాలో భారీగా పొడగడుపుల మధ్య ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులోనూ ప్రత్యేకంగా మహిళలు మరియు వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు లైన్‌లో నిలబడే తమ ఓటు హక్కును చలాయించారు. బళ్లారి సీటి, బళ్లారి రూరల్, కంప్లీ, హోసపేట, హగ్రీ బొమ్మనహళ్లి, కోడ్లగి తదితర ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఓటర్లు హక్కును వినియోగించుకున్నారు. పిల్లల మీద శాఖలకు చెందిన 5952ఇబ్బందులు మరియు అధికారులు ఎన్నికల విధులు పాల్గొన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులకు మరియు సిబ్బందులకు తగిన మౌళిక సదుపాయాలు సమకూర్చినట్లు తెలిసింది. విధుల సమయంలో కొన్ని ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఇబ్బందులు అశ్వత్ గురైన సంఘటన చోటు చేసుకుంది. అక్కడే బసవేసిన ఆరోగ్య శాఖ అధికారులు అస్వస్థతకు గురైన సిబ్బందులకు ప్రాథమిక చికిత్స అందించి, తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

**బిజేపి-కాంగ్రెస్ నడుమ పోటా పోటీ ఫైట్ :** ఇదిలా ఉంటే బళ్లారి లోకసభ నియోజకవర్గంలో బిజెపి తరుపున మాజీ మంత్రి శ్రీరాములు మరియు కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యే తుకారం పోటాపోటీగా స్ట్రీట్ ఫైట్ ఏర్పడిందని చెప్పుకోవచ్చు. నాలుగవ తేదీన ఓట్ల లెక్కింపులో అదృష్టం ఎవరికి వరిస్తుందో వేచి చూడాల్సిందే.

**70కు అధిక శాతం అధిక ఓటు హక్కును వినియోగం :** జిల్లాలోని మొత్తం 18లక్షలకు పైగా ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో లక్షకు పైగా కొత్త ఓటర్లు కావడం ప్రత్యేకం. ఈ నేపథ్యంలో పురుషులతో పాటు మహిళా ఓటర్లు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ బాధ్యతను నిరూపించు అవకాశం ఉన్నట్లు సమాచారం. నేడు బళ్లారి లోకసభ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో సుమారు 70కు అధిక శాతం అధిక తమ ఓటు హక్కును నిర్ణయించుకున్నట్లు సమాచారం.

## టిడిపి నుంచివైసీపీలో చేరిక



పార్టీలో చేరుతున్న టిడిపి నాయకులు

చెన్నేకొత్తపల్లి, మే 07 ప్రభాతవార్త

మండలవరిధిలోని వెంకటంపల్లి గ్రామానికిచెందిన టిడిపిని వీడి వైసీపీలో చేరారు. ఎమ్మెల్యేప్రకాష్‌రెడ్డి చెన్నేకొత్తపల్లి మండంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో మంగళవారం వెంకటాంపల్లిగ్రామానికి చెందిన టిడిపి నాయకులు కె.శివారెడ్డి, చాకలి రాజప్ప, చాకలి రవి, హరిజన అంజి, ఎమ్మెల్యేతోపుదుర్తిప్రకాష్‌రెడ్డి, సమక్షంలో వైసీపీలోకి చేరారు. చేరిన వారికి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కండువా కప్పి వైసీపీ పార్టీలోకి ఆహ్వానించారు.

